క్లుప్తంగా

సిరులతల్లికి పంచామృతాభిషేకం



ప్రత్యేక అలంకరణలో కనకమహాలక్ష్మి

డాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. ఈ సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. ఈ ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు బ్రాంచ్, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీనివాసులరెడ్డి, ఏఈవోలు కె. తిరుమలేశ్వరరావు, వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

రేణుక యల్లమ్మ ఆలయంలో అన్న సమారాధన



అన్నప్రసాదం వడ్డిస్తున్న ఆలయ కార్యవర్గ సభ్యులు, భక్తులు

అల్లిపురం : కెప్టెన్ రామారావు జంక్షన్‌లో వెలసిన శ్రీ రేణుక యల్లమ్మ అమ్మవారి ఆలయంలో గురువారం అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ అధ్యక్షుడు కర్రి నీలకంఠం, కార్యదర్శి బొడ్డు పోలారావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారి అన్నప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ కార్యవర్గ సభ్యులు వాసుపల్లి నారాయణ, పంపాన గణేష్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



వ్యక్తి మృతదేహం

మద్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. జ్ఞానాపురం 8వ నంబర్ ప్లాట్‌ఫాం వెనుక ఉన్న వెస్ట్‌సైడ్ బ్లాక్ వద్ద పునాదులు వేసి ఉంచిన సుమారు 5 అడుగుల లోతు నీరు కలిగి ఉన్న ఓ చెరువులో సుమారు 50 ఏళ్ల వయసున్న ఓ వ్యక్తి గురువారం మృతిచెంది ఉండడాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఐదో పట్టణ ఎస్‌ఐ రవికుమార్‌తోపాటు హెడ్ కానిస్టేబుల్ మూర్తి సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఈ ప్రాంతంలో చుట్టుపక్కల ఉన్న యాచకులు తదితరులు అక్కడే నివసిస్తూ, ఆ నీటిలోనే స్నానాలు చేస్తుంటారని, మృతుడు కూడా చిత్తు కాగితాలు ఏరుకుంటూ, అక్కడే స్నానం చేస్తుంటాడని, ఆ చుట్టుపక్కలే జీవిస్తుంటాడని స్థానికులు చెబుతున్నారు. జ్ఞానాపురం మహిళా పోలీస్ లావణ్య ప్రియ ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ రామారావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు కూడా తాగునీటి సరఫరాకు అంతరాయం

డాబాగార్డెన్స్ : కొమ్మాది పంపు హౌస్‌కు సంబంధించి పంపు సెట్ మరమ్మతులు చేపట్టిన దృష్ట్యా శుక్రవారం జోన్–2 పరిధి 9, 10 వార్డుల్లోని అన్ని ప్రాంతాలు, చినగదిలి, పెదగదిలి, సూర్యతేజనగర్, గాంధీనగర్, బాలాజీనగర్, అన్నానగర్, పాత ఆరిలోవ, సాలిపేట, సాగర్‌నగర్, గుడ్లవానిపాలెం, సుభాష్‌నగర్, వివేకానందనగర్, తాటిచెట్లపాలెం, దసపల్లా లే అవుట్, రాజీవ్‌నగర్, రెడ్డీస్ కాలనీ, పెద రుషికొండ, చిన్న రుషికొండ, ఎండాడ ఎస్సీ, బీసీ కాలనీ, జోన్–3 పరిధి ఎంవీపీ కాలనీ సెక్టార్ 1 నుంచి 12తో పాటు పలు ప్రాంతాల్లో తాగునీటికి అంతరాయం ఏర్పడనుందని పర్యవేక్షక ఇంజినీరు కేవీఎస్ రవి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయా ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా మంచి నీటి సరఫరా చేయనున్నట్టు తెలిపారు.

ఉన్నత లక్ష్యం..
విలువలే ధ్యేయం

ఒకప్పుడు ఇంటర్‌లో సీటు సంపాదించాలంటే అవస్థలు పడేవారు. అత్యధిక మార్కులు వస్తేనే సీటు దొరికేది. ఆ సీట్లకు ఎంతో పోటీ ఉండేది. తమ పిల్లలకు కళాశాలలో సీటు పొందే వరకు తల్లిదండ్రులు ఆయా కళాశాలల చుట్టూ తిరుగుతుండేవారు. పదేళ్ల కిందటి పరిస్థితి చూసుకుంటే.. ప్రభుత్వ, ఎయిడెడ్ కళాశాలల్లో ఫస్ట్‌లిస్ట్.. సెకండ్ లిస్ట్.. థర్డ్ లిస్ట్ అంటూ పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు వచ్చిన వారిని ఇలా లిస్ట్‌ల వారీగా ప్రకటించి ప్రవేశాలు కల్పించేవారు.



హైస్కూల్ ప్లస్ (ఇంటర్)గా అప్‌గ్రేడ్ సాధించిన లక్ష్మీటాకీస్ ఎంవీడీఎం హైస్కూల్



మధ్యాహ్న భోజనం మెనూ ఇలా..

- పాఠశాల స్థాయి నుంచి కళాశాల స్థాయికి ఎంవీడీఎం హైస్కూల్ అప్‌గ్రేడ్
- 2024–25 విద్యా సంవత్సరం నుంచి ఇంటర్ విద్య
- జూన్ ఒకటి నుంచి తరగతులు ప్రారంభం
- ఎంపీసీలో 40.. సీఈసీలో 40 సీట్లు
- చక్కటి మౌలిక సదుపాయాల ఏర్పాటు

డాబాగార్డెన్స్ : ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి విద్యా వ్యవస్థలో పెను మార్పులు తీసుకొచ్చారు. ఉచిత విద్యకు ప్రాధాన్యం కల్పిస్తూ.. అప్పటి వరకు డబ్బుతో ముడిపడి ఉన్న విద్యా విధానానికి స్వస్తి పలికారు. విద్యకు ఏమాత్రం ఆర్థిక పరిస్థితులు కారణం కాకూడదనే ముందు చూపుతో అనేక మార్పులు తీసుకొచ్చారు. ఎక్కడా డ్రాపవుట్స్ ఉండకూడదని.. పేదలు విద్యలో రాణించాలన్న సత్సంకల్పంతో అమ్మ ఒడి.. విద్యా దీవెన.. వసతి దీవెన.. విద్యా కానుక.. గోరుముద్ద.. ఇలా అనేక సంక్షేమ కార్యక్రమాలు తీసుకొచ్చారు. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో మౌలిక వసతులు కల్పించడంతో పాటు ఉచితంగా పాఠ్య పుస్తకాలు, బ్యాగ్‌లు, షూస్, యూనిఫాంతో పాటు పేద విద్యార్థులను దృష్టిలో పెట్టుకుని మధ్యాహ్నం వేళల్లో పౌష్టికాహారం అందజేసేవారు.

పేద విద్యార్థుల ఉన్నతికి పాఠశాలల అప్‌గ్రెడేషన్.. పేద పిల్లలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వ పాఠశాలలను అప్‌గ్రేడ్ చేసుకుంటూ వస్తున్నారు. ప్రాథమిక పాఠశాలలను ప్రాథమికోన్నత పాఠశాలలుగా.. ప్రాథమికోన్నత పాఠశాలలను.. హైస్కూళ్లుగా.. హైస్కూళ్లను హైస్కూల్ ప్లస్ (ఇంటర్మీడియట్)గా అప్‌గ్రేడ్ చేశారు. ఈ ఏడాదికి సంబంధించి పాతనగరంలోని లక్ష్మీటాకీస్ ప్రాంతంలో గల ఎంవీడీఎం హైస్కూల్‌ను.. హైస్కూల్ ప్లస్ (ఇంటర్మీడియట్ విద్య)గా అప్‌గ్రేడ్ చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఈ స్కూల్లో ఇంటర్ విద్యకు సంబంధించి 40 ఎంపీసీ, 40 సీఈసీ సీట్లు కేటాయించారు.

ఇంటర్ విద్యకు శ్రీకారం..

దక్షిణ నియోజకవర్గంలో అతి పేదరికంలో ఉన్న ప్రాంతం ఏదైనా ఉందీ అంటే అది పాతనగరమే. ఈ ప్రాంతంలో ఎక్కువగా ఉండేది పేద.. బడుగు.. బలహీన వర్గాల వారే. రోజంతా కష్టపడితేనే కుటుంబ పోషణ జరిగేది. అటువంటి పేదల కోసం ఎంవీడీఎం హైస్కూల్‌ను అప్‌గ్రేడ్ చేస్తూ ఇంటర్మీడియట్ విద్యకు శ్రీకారం చుట్టారు. ఈ హైస్కూల్లో అన్ని రకాల మౌలిక సదుపాయాలతో పాటు ఉచిత విద్య అందిస్తున్నారు. నామమాత్రపు ఫీజుతోనే ప్రవేశాలు కల్పిస్తున్నారు.



విశాలమైన క్రీడా ప్రాంగణం



పచ్చని చెట్ల నడుమ విశాలమైన పాఠశాల /కళాశాల ప్రాంగణం



ఐఎఫ్‌పీ ప్యానల్‌తో తరగతి గది



అధునాతన మంచినీటి సరఫరా కేంద్రం

దరఖాస్తులకు ఆహ్వానం..



2024–25 విద్యా సంవత్సరం నుంచి హైస్కూల్‌ను హైస్కూల్ ప్లస్ (ఇంటర్మీడియట్)గా అప్‌గ్రేడ్ చేశారు. పదో తరగతిలో ఈ పాఠశాలలో చదివిన విద్యార్థులే కాక పరిసర ప్రాంతాల్లో ఉన్న విద్యార్థులు ఎవరైనా దరఖాస్తు చేసుకోవచ్చు. ఎంపీసీ 40, సీఈసీ 40 సీట్లు ఉన్నాయి. ఇటీవల పదో తరగతిలో ఉత్తీర్ణులైన విద్యార్థులు ఆయా కోర్సుల్లో ప్రవేశం పొందవచ్చు. అధునాతన పద్ధతిలో బోధన జరగనుంది. ప్రతి తరగతిలోనూ ఐఎఫ్‌పీ ప్యానెల్ (డిజిటల్ బోర్డు)ను ఉపయోగిస్తూ విద్య అందిస్తున్నాం. ప్రస్తుతం పాఠశాలలో ఉన్న ఉపాధ్యాయులతో పాటు అవసరం మేరకు అధ్యాపకులు/ఉపాధ్యాయులను నియమించే అవకాశం ఉంది. అందుకు విద్యాశాఖ నుంచి అనుమతులు వచ్చాయి. ముఖ్యంగా పేద విద్యార్థులకు విద్య దూరం కాకూడదని, డబ్బులు లేని కారణంగా, ఆర్థిక ఇబ్బందులతో పేద పిల్లలు విద్యకు దూరం కాకూడదన్న మంచి ఉద్దేశంతో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఎంతో సంతోషకరం. ఎందుకంటే ఈ ప్రాంతంలో ఉండే వారంతా పేద, బడుగు, బలహీన వర్గాల వారే. వీరిది చాలీ చాలని ఆదాయం. ఇంట్లో అంతా కష్టపడితేనే వారి కుటుంబం సాగేది. ఈ తరుణంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఎక్కడికో వెళ్లి.. లక్షలు వెచ్చించి చదివించలేదని పిల్లలకు హైస్కూల్ ప్లస్ ఓ వరం. – **ఎస్వీ శేషుకుమారి,** ప్రధానోపాధ్యాయురాలు, ఎంవీడీఎం హైస్కూల్, లక్ష్మీటాకీస్ ఏరియా, పాతనగరం

సాయిబాబాను దర్శించుకున్న వాసుపల్లి దంపతులు



శ్రీ షిర్డీ సాయిబాబా సన్నిధిలో వాసుపల్లి గణేష్‌కుమార్ దంపతులు

అల్లిపురం : వైఎస్సార్‌సీపీ దక్షిణ ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్, తన సతీమణి ఉషతో కలిసి అచ్చియ్యమ్మపేటలో వెలసిన శ్రీ షిర్డీ సాయిబాబాను గురువారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అలయ నిర్వాహకుడు ఉమ్మిడి నాగరాజుతో పాటు వార్డు నాయకులు లండా రమణ, లింగం శ్రీనివాసరావు స్వాగతం పలికారు. అనంతరం వాసుపల్లి దంపతులు సాయిబాబాకు అభిషేకాలు చేపట్టి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకుడు ఉమ్మిడి నాగరాజు వాసుపల్లి దంపతులను సాయిబాబా శేషవస్త్రాలతో సత్కరించి, ప్రసాదం అందజేశారు.

నూతన కార్యవర్గం ఎంపిక



ఎంపికైన నూతన కార్యవర్గం

డాబాగార్డెన్స్ : విశాఖ జిల్లా అఖిల గాండ్ల, తెలికుల సంక్షేమ సంఘం సర్వసభ్య సమావేశం గురువారం ఓ హోటల్లో నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు దాడి సత్యనారాయణ నేతృత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వందలాది మంది కుల సంఘాల నాయకులు, సభ్యులు పాల్గొన్నారు. సమావేశం అనంతరం నూతన కార్యవర్గాన్ని, ట్రస్ట్‌బోర్డును ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా దాడి సత్యనారాయణ, ట్రస్ట్‌బోర్డు చైర్మన్‌గా పెబ్బిలి రవికుమార్ ఎన్నికయ్యారు. సంఘం కన్వీనర్‌గా జిల్లా సంఘం వ్యవస్థాపకుడు ఎన్నేటి తాతారావు, ప్రధాన కార్యదర్శులుగా చిత్రాడ అప్పారావు, పేరూరు గణేష్, కోశాధికారిగా ఎన్నేటి సన్యాసిరావు, లీగల్ సెల్ అధ్యక్షుడిగా తెలుకల శ్రీనివాసరావును ఎన్నుకున్నారు. మహిళా కమిటీని ఎన్నేటి వెంకటరమణ ప్రకటించారు.

లేపాక్షిలో సరికొత్త చీరలు

- హస్తకళలపై 15 నుంచి 20 శాతం రాయితీ
- ఎంపోరియం మేనేజర్ కార్తీక్ వెల్లడి



జగదాంబ జంక్షన్‌లో గల లేపాక్షి హస్తకళల ఎంపోరియం

డాబాగార్డెన్స్ : జగదాంబ జంక్షన్‌లో గల లేపాక్షి హస్తకళల ఎంపోరియంలో సరికొత్త చేనేత, కాటన్, కలంకారీ చీరలు అందుబాటులోకి తెచ్చినట్టు సంస్థ మేనేజర్ ఎ. కార్తీక్ తెలిపారు. ఎంపిక చేసిన మంగళగిరి కాటన్, కొత్త కలర్ షేడ్స్‌లో సిల్క్, హ్యాండ్ బ్లాక్ ప్రింటెడ్ కలంకారీ, పెన్ పెయింటెడ్ కలంకారీ చీరలు, మరెన్నో చేనేత చీరలు ప్రత్యేకించి మహిళల కోసం అందుబాటులోకి తెచ్చామన్నారు. అలాగే ఎంచుకున్న హస్తకళలపై 15 నుంచి 20 శాతం ప్రత్యేక ప్రమోషనల్ డిస్కౌంట్ ఇస్తున్నామన్నారు. లెదర్, తోలుబొమ్మలు, ల్యాంప్ షేడ్స్, తాటి ఆకు ఉత్పత్తులు, కలంకారీ పెయింటింగ్‌లు, బంజారా బ్యాగులతో పాటు వేసవి కోసం అందుబాటులో ప్రత్యేక హ్యాండ్‌మేడ్, హ్యాండ్లూమ్ చీరలు ప్రదర్శన, విక్రయాలు జరుగుతున్నాయని చెప్పారు. ఈ అవకాశాన్ని విశాఖ నగర ప్రజలు వినియోగించుకోవాలని తెలిపారు.

ఘనంగా సిటు వ్యవస్థాపక దినోత్సవం



జెండా ఎగురవేస్తున్న సిటు నాయకులు

డాబాగార్డెన్స్ : కార్మిక రాజ్య స్థాపనకు కృషి చేద్దామని సిటు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ పిలుపునిచ్చారు. సిటు ఆవిర్భావ దినోత్సవం గురువారం పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ముందుగా సిటు జిల్లా ఉపాధ్యక్షుడు కేఎం కుమార మంగళంతో కలిసి పలువురు నాయకులు జెండా ఎగురవేశారు. అనంతరం కుమార్ మాట్లాడుతూ 1970 మే 30న కోల్‌కతాలో సిటు ఏర్పాటైందన్నారు. అన్ని కార్మిక సంఘాలను ఐక్యం చేసి ఒక తాటిపైకి తీసుకొచ్చి ప్రభుత్వ విధానాలను వ్యతిరేకంగా మిలిటెంట్ పోరాటాలు నిర్వహించిందన్నారు. మోదీ అధికారంలోకి వస్తే ఉన్న కార్మిక హక్కులు కూడా లేకుండా చేస్తారని ఆరోపించారు. కార్యక్రమంలో విశాఖ జిల్లా వర్కింగ్ ఉమెన్ కన్వీనర్ పి. మణి, సిటు నాయకులు బి. జగన్, ఎం. సుబ్బారావు, నూకరాజు, యు. రాజు, వై. రాజు, పైడిరాజు, బంగారయ్య, నరసింగరావు, చంద్రమౌళి, సూరీడు, పోలేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా ప్రత్యేక అవసరాల పిల్లల గుర్తింపు సర్వే



సర్వేలో పాల్గొన్న సహిత విద్య కో–ఆర్డినేటర్ గీత, ఎంఈవో రామారావు

విశాఖ విద్య: ప్రత్యేక అవసరాల పిల్లలను గుర్తించేందుకు జిల్లాలో చేపడుతున్న సర్వేపై శ్రద్ధ తీసుకోవాలని సహిత విద్య కో–ఆర్డినేటర్ గీత కోరారు. ఐఈఆర్పీలు చేపడుతున్న సర్వేను గురువారం నగరంలో ఆమె పరిశీలించారు. సీతమ్మధార మండలంలోని శ్రీనివాసనగర్‌లో నిర్వహిస్తున్న సర్వేలో ఎంఈవో రామారావుతో కలిసి ఆమె పాల్గొన్నారు. భవిత టీచర్లు జగదాంబ, శారద ఇంటింటికీ గుర్తించిన పిల్లలకు పాఠశాలల్లో చర్పించేలా వారికి అక్కడికక్కడే అడ్మిషన్లు ఇచ్చేలా ఏర్పాట్లు చేశారు. సర్వే పక్కాగా చేపట్టాలని సూచించారు. ప్రత్యేక అవసరాల పిల్లలకు ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని, వాటిని వినియోగించుకోవాలంటే తప్పనిసరిగా సర్వేలో నమోదై ఉండాలన్నారు. దీనిపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించి, సర్వేను విజయవంతం చేయాలని ఐఈఆర్పీలకు సూచించారు.

మహిళా ఉద్యోగి అనుమానాస్పద మృతి

సీతమ్మధార : దొండపర్తి సమీపంలోని ఒక హోటల్‌లో ప్రభుత్వ మహిళా ఉద్యోగి అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. విజయవాడకు చెందిన శ్రీలక్ష్మి (36) స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గుమస్తాగా పనిచేస్తోంది. 2021లో ఆమె భర్త మృతి చనిపోవడంతో ఈ ఉద్యోగం వచ్చింది. కాగా ఆమెకు ఇద్దరు పిల్లలున్నారు. కొద్దిరోజులుగా ఆమె విజయవాడకు చెందిన మహేష్‌బాబుతో చనువుగా ఉంటుంది. అతడు విదేశాలు వెళ్లేందుకు పాస్‌పోర్టుకు దరఖాస్తు చేసుకోగా గతంలో నగరంలోని ఓ పోలీస్‌స్టేషన్‌లో కేసు ఉండటంతో మంగళవారం విశాఖ వచ్చారు. దొండపర్తి దరి అయోధ్య హోటల్‌లో దిగారు. బుధవారం ఉదయం ఆమెకు ఛాతీలో నొప్పి రావడంతో దగ్గరలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందారు. అయినా తగ్గకపోవడంతో ఆమె సోదరికి ఫోన్ చేసి వెంటనే విశాఖ రావాలని చెప్పింది. మధ్యాహ్న సమయంలో ఒక్కసారిగా కుప్పకూలిపోవడంతో మహేష్‌బాబు 108కు ఫోన్ చేసి సమాచారం ఇచ్చాడు. అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించుకున్నారు. సమాచారం తెలుసుకున్న ఫోర్తుటౌన్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హనుమత్ జయంతికి ఆలయాలు సిద్ధం



కెప్టెన్ రామారావు జంక్షన్‌లో గల ప్రసన్నాంజనేయస్వామి ఆలయం



అచ్చియ్యమ్మపేటలో గల శ్రీఅభయ హస్తాంజనేయ స్వామి దేవాలయం



వెంకటేశ్వరమెట్టపై గల శ్రీ ఆంజనేయస్వామి దేవాలయం

అల్లిపురం : ఒకటో తేదీన హనుమత్ జయంతి ఘనంగా నిర్వహించేందుకు ఆలయాలు సిద్ధమవుతున్నాయి. కెప్టెన్ రామారావు జంక్షన్‌లోని రేణుక యల్లమ్మ ఆలయంలో వేంచేసిన ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయం, సౌత్ జైలురోడ్డులోని ఆంజనేయస్వామి ఆలయం, వెంకటేశ్వరమెట్టపై గల ఆభయాంజనేయ స్వామి దేవాలయం, అచ్చియ్యమ్మపేటలో గల అభయాంజనేయ స్వామి దేవాలయంలో శనివారం తెల్లవారు జాము నుంచే పూజలు, విశేష అభిషేకాలు, హోమాలు, తమలపాకుల పూజ, వడమాలలతో స్వామివారికి విశేష పూజలు నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. కొన్ని చోట్ల అన్నసమారాధనకు చర్యలు చేపడుతున్నారు.

అలరించిన సినీ సంగీత విభావరి

సీతంపేట: సూపర్‌స్టార్ కృష్ణ జయంతి సందర్భంగా పల్లవి మ్యూజిక్ సినీ సాంస్కృతిక సంస్థ గురువారం సాయంత్రం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించిన సినీ సంగీత విభావరి శ్రోతలను అలరించింది. బి.ఫణిభూషణ్ పాడిన తెలుగు వీర లేవరా, పల్లా బాబ్జి, పావని పాడిన దోరవయసు చిన్నది, ఆంజనేయరెడ్డి, అంబిక పాడిన ఈ గాలిలో ఎక్కడో అలికిడి, వెంకటేష్ మాస్టారు, స్వరూప పాడిన ఎక్కడో చూసిన జ్ఞాపకం, వీరేంద్ర, భాగ్యలక్ష్మి పాడిన నమస్తే.. సుస్వాగతం పాటలు ప్రేక్షకులను ఉత్సాహపరిచాయి. వీరికి కీబోర్డుపై సోమేష్, తబలాతో ఏవీ చలం, ప్యాడ్స్‌తో బాబ్జి, గిటార్‌తో రమణమూర్తి వాద్య సహకారం అందించారు.

ఫుట్‌పాత్‌పై యాచిస్తున్న వారికి కౌన్సెలింగ్



ప్రకాశం జిల్లాకు చెందిన నిదిరాణి, శ్రీను, చిన్నారి స్వప్నరాణితో ప్రగడ వాసు

అల్లిపురం : నగరంలో చిన్నారితో కలిసి యాచిస్తున్న వారికి జీవీఎంసీ ఏయూటీడీ సిబ్బంది కౌన్సెలింగ్ నిర్వహించారు. ప్రకాశం జిల్లా కంభం నుంచి వచ్చి నగరంలో యాచిస్తున్న నిదిరాణి, శ్రీను, చిన్నారి స్వప్నప్రియలకు గురువారం జీవీఎంసీ టీఎస్సార్ షెల్టర్‌లో ఆశ్రయం కల్పించారు. వారు రెండేళ్లుగా ఈ పనిలో ఉన్నారు. మత్తు మందులకు అలవాటు పడిన వారు షెల్టర్‌లో ఉండమని, ఫుట్‌పాత్ పైనే ఉంటామని పోలీసుల ముందు గొడవ చేయటంతో వారికి కౌన్సెలింగ్ చేశారు. వారి సొంత ఊరు వెళ్లిపోవాలని లేని ఎడల పాపను శిశుగృహకు అప్పగిస్తామని మందలించినట్లు ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు.

సికింద్రాబాద్–సిల్చార్ రద్దు

తాటిచెట్లపాలెం : సికింద్రాబాద్–సిల్చార్(12513) ఎక్స్‌ప్రెస్ జూన్ 1వ తేదీన రద్దు చేసినట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. ఎర్నాకుళం–టాటా (18190) ఎక్స్‌ప్రెస్ జూన్ 6 నుంచి 12వ తేదీ వరకు మళ్లించిన మార్గంలో వయా విజయనగరం, ఖుర్దారోడ్, కటక్, జక్‌పూర, జరోలి మీదుగా నడుస్తుంది. టాటా–ఎర్నాకుళం (18189) ఎక్స్‌ప్రెస్ జూన్ 7 నుంచి 14వ తేదీ వరకు మళ్లించిన మార్గంలో వయా జరోలి, జక్‌పురా, కటక్, ఖుర్దారోడ్, విజయనగరం మీదుగా నడుస్తుంది.

వ్యక్తి అదృశ్యం



న్యాయవాది సత్యనారాయణ

అల్లిపురం : న్యాయవాది ఒకరు కోర్టుకు వెళ్లి తిరిగి ఇంటికి చేరలేదని టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు నమోదు అయింది. ఈ మేరకు టూటౌన్ సీఐ బి.తిరుమలరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మద్రిపాలెంలోని సాయినగర్ కాలనీకి చెందిన కేవీవీ సత్యనారాయణ (45) న్యాయవాదిగా జిల్లా కోర్టులో ప్రాక్టీస్ చేస్తున్నారు. ఈ నెల 28వ తేదీన ఆయన ఇంటి నుంచి కోర్టుకు వెళ్తున్నట్లు చెప్పి వెళ్లారు. అలా వెళ్లిన ఆయన తిరిగి ఇంటికి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు కోర్టు పరిసర ప్రాంతాలు, నగరంలోని పలు ప్రాంతాల్లో వెదికినా అతని ఆచూకీ తెలియకపోవటంతో టూటౌన్ పోలీసు స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేశారు. తప్పిపోయిన వ్యక్తి 5 అడుగుల 6 అంగులాల ఎత్తు, ఛామనఛాయ కలిగి, న్యాయవాది దుస్తుల్లో ఉన్నారని తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 9440904716, 9949925839 ఫోన్ నంబర్లలో తెలియజేయగలరని కోరారు.

కథలతో విజ్ఞానం, వికాసం



విద్యార్థులకు కథాసారం వివరిస్తున్న ఉపాధ్యాయుడు వరప్రసాద్

పెదగంట్యాడ: విజ్ఞానాన్ని సముపార్జించే కథలను విద్యార్థులు చదవాలని స్థానిక ఉపాధ్యాయుడు వరప్రసాద్ అన్నారు. పుస్తకాలు చదివితే విజ్ఞానం పెంపొందడంతో పాటు వ్యక్తిత్వం సొంతమవుతుందని తెలిపారు. పెదగంట్యాడ శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా గురువారం విద్యార్థులకు కథలను బోధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చందమామ, బాలమిత్ర వంటి పుస్తకాల్లో కథలు చదివితే వాటిలోని నీతి అర్థమవుతుందని, అలాగే మన నడవడిక బాగుంటుందని చెప్పారు. అనంతరం విద్యార్థులతో ఆటలు ఆడించారు. గ్రంథాలయాధికారి పీవీ రమణ ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో నవ్య, కుమారి, రాధిక తదితరులు పాల్గొన్నారు.